క్లుప్తంగా

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఏడీఏ రాజరత్నం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

కేశంపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ రాజరత్నం అన్నారు. భారత సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని ఇప్పలపల్లి, అల్వాల, కొనాయపల్లి, ఎక్లాస్‌ఖాన్‌పేట, చౌలపల్లి, పోమాల్‌పల్లి గ్రామాల్లో సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా అల్వాల గ్రామంలో ఏడీఏ రాజరాత్నం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ పైన డ్రోన్‌లు అందిస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు అందె బాబయ్య, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ ఆంజనేయులు, మండల వ్యయసాయ అధికారి శిరిష, మండల వ్యవసాయ విస్తరణ అధికారి వినేయ్, డ్రోన్ టెక్నిషీయన్ అంజు సాహెబ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రొల్లు రఘురంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ జన్మభూమి అక్షితల పంపిణీ



కొకుంట్ల గ్రామంలో అక్షింతల పూజలో గ్రామ నాయకులు

చేవెళ్ల: కొకుంట్ల గ్రామంలో శ్రీరామ జన్మభూమి అక్షింతలు పంపిణీ చేశారు. మంగళవారం గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ద్వారా అక్షింతలను ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రతీ ఇంటికి ఈ అక్షింతలను పంపిణీ చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ పి క్రిష్టారెడ్డి, సర్పంచ్ గాయత్రిగోపాలక్రిష్ణ, మాజీ ఉప సర్పంచ్ మల్లారెడ్డి, నాగార్జున్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి పరామర్శ

చేవెళ్ల: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆలూరు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కృష్ణకుమార్‌గౌడ్ కుటుంబాన్ని చేవెళ్ల మండల ఉపాధ్యాయ బృందం పరామర్శించింది. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు చేవెళ్ల రెసిడెన్సీ టీచర్స్ సంఘం తరుపున ఆర్థిక సహాయం చేశారు. మండల విద్యాధికారి అక్బర్, సంఘం అధ్యక్షుడు ఖాజాపాషా మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా వారి సేవలను గుర్తించడంతోపాటు ఆపదలో మేము ఉన్నామనే భరోసా కల్పించేందుకు తాము కృషి చేస్తున్నట్లు చెప్పారు. కృష్ణకుమార్‌గౌడ్ మృతి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, అరుణ్‌కుమార్, అక్బర్, సత్తయ్యగౌడ్, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు పీఏసీఎస్ చైర్మన్ రాజీనామా



మాట్లాడుతున్న దామోదర్ రెడ్డి

కొందుర్గు: కొందుర్గు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ దామోదర్ రెడ్డి బీఆర్ఎస్‌కి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకుల మోసపూరిత మాటలను ప్రజలు నమ్మొదని, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమనే నమ్మకంతో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. తను కొందుర్గు జెడ్పీటీసీగా ఉన్న సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జెడ్పీటీసీగా ఉన్నారని గుర్తు చేసుకున్నారు. ఆయనతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని తెలిపారు. త్వరలోనే తను అనుచరవర్గంతో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రకటించారు.

మొక్కలు నాటిన విద్యార్థులు



మొక్కలు నాటిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

మంచాల: జాపాల ఉన్నత ప్రాథమిక పాఠశాలలో మంగళవారం 'సేవ్ నేచర్–సేవ్ ఫ్యూచర్' నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. మొక్కల పెంపకం యొక్క అవశ్యకతను ఉపాధ్యాయులు.. విద్యార్థులకు తెలియజేశారు. ప్రధానోపాధ్యాయులు బీమ్లానాయక్, జహీర్, పాల్గొన్నారు.

గ్యారెంటీ పథకాలను అమలు చేస్తాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కొత్తూరు: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూరు: ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీ పథకాలను అమలు చేసి తీరుతామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. మంగళవారం కొత్తూరు మండలంలోని గూడూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలనలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం హామీలతోనే పాలన సాగించినట్లు తెలిపారు. కాంగ్రెస్ హామీలు అమలు చేయడానికి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి, సర్పంచ్ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: అర్హులైన పేదలందరికి ఆరు గ్యారంటీలు అమలుచేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ప్రజాపాలనలో భాగంగా జిల్లేడ్ చౌదరి గూడ మండలం ఫీర్జాపూర్‌లో నిర్వహించిన గ్రామ సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తామన్నారు. ఆర్డీఓ వెంకట మాధవరావు, తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపీ విజయ్ కుమార్ పాల్, ఏపీఎం రామస్వామి పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్‌లో..

మొయినాబాద్ రూరల్: నాలుగో రోజు 1,984 దరఖాస్తులు అందాయని మండల అభివృద్ధి అధికారి సంధ్యా తెలిపారు. ఎంపీవో వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: సుందరపురం, కాకునూర్, బైర్కాన్‌పల్లి, బోధునంపల్లి, మంగళిగూడ, తూర్పుగడ్డతండా గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటుచేశారు. తహసీల్దార్ అజీంఅలీ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శిరీష, ఎంపీఓ నర్సింలు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేశంపేటలో ఉద్రిక్తత..

కాకునూర్‌లో నిర్వహించిన గ్రామసభలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని బయానగడ్డ తండాకు చెందిన 50 మంది గతంలో కాకునూర్ గ్రామంలో ఓటరుగా నమోదు చేసుకున్నారు. అభివృద్ధి పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు అక్కడికి వచ్చిన గిరిజనులను బీఎస్పీ నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అజీంఅలీ ఎక్కడి వారు అక్కడే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈపీఏసీఎస్ చైర్మన్ గంగ్ర జగదీశ్వర్‌గౌడ్, బీఎస్పీ మండల అధ్యక్షుడు సాంటే శ్రీనివాస్, పర్వతాలు, లింగం, శ్రీశైలం, రవీందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్: లబ్ధిదారులు ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ పేర్కొన్నారు. కుత్బుద్దీన్‌గూడలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వ్యవసాయాధికారి రాగమ్మ, సర్పంచ్ పద్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుదని పామెన నర్సింహులు, జాకీర్‌షరీఫ్ పేర్కొన్నారు. పోతుగల్ సర్పంచ్ ఇస్మత్‌బేగం, తదితరులు పాల్గొన్నారు.



షాబాద్: దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు



మొయినాబాద్: కుత్బుద్దీన్‌గూడలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్



కొందుర్గు: ఫీర్జాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కేశంపేట: మాట్లాడుతున్న తహసీల్దార్ అజీంఅలీ

సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య

షాబాద్: సర్కార్ బడుల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని షాబాద్ మండల నోడల్ అధికారి లక్ష్మణ్ పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని సర్దార్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు లిఖీతశ్రీ కుమారుని పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు నోటు బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తమవంతు సహాయసహకారాలు అందిస్తామన్నారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకొని, ఏకాగ్రత, పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. సర్పంచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు సరైన వైద్యం అందించాలి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి

నందిగామ: పీహెచ్‌సీకి వస్తున్న రోగులకు సకాలంలో సరైన వైద్యం అందించాలని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ జయలక్ష్మి సిబ్బందికి సూచించారు. నందిగామలోని పీహెచ్‌సీలో నిర్వహించిన ×ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆస్పత్రికి వచ్చే మహిళ రోగులతో పాటు మిగతా వారిని సైతం ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం చికిత్స కోసం వచ్చిన రోగులతో ఆమె మాట్లాడి వైద్యం అందిస్తున్న తీరును తెలుసుకున్నారు. సుమారు 80 మంది రోగులను పరీక్షించినట్లు ఆమె తెలిపారు. డాక్టర్ నజం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కను ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి ఆయన శాలువా కప్పి సత్కరించి పూలబొకే అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గ సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో అందే విధంగా చూడాలని మంత్రులు సూచించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చెంది తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

మురుగుకు అడ్డుకట్టేదీ?



ఎన్జీఓస్ కాలనీలోని లేబర్ అడ్డా వద్ద రోడ్డుపై పారుతున్న మురుగు

- నిత్యం రోడ్లపై పారుతున్న మురుగు
- సమస్య పరిష్కారంపై అధికారుల నిర్లక్ష్యం
- దుర్గంధంతో జనం అవస్థలు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ పరిధిలోని లేబర్ అడ్డా వద్ద నిత్యం మురుగునీరు రోడ్లపైకి రావడం వల్ల కాలనీవాసులు, పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ వర్క్స్ అధికారులు మురుగు నీరు పారకుండా చర్యలు తీసుకోకపోవడంతో దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయకపోవడంతో మట్టి పేరుకపోయి మురుగునీరు ప్రతి రోజూ రోడ్లపై పారుతోంది. వాటర్ వర్క్స్ అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోని కారణంగా నిత్యం అక్కడ దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో కాలనీవాసులే కాకుండా నిత్యం వందల సంఖ్యలో వివిధ పనుల కోసం వచ్చి అక్కడ నిల్చునే కార్మికులు సైతం దుర్వాసనతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు కేవలం కార్యాలయానికే పరిమితం అవుతున్నారని, క్షేత్ర స్థాయిలో సమస్యలపై ఆరా తీయకపోవడంతో ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వాటర్ వర్క్స్ అధికారులు రోడ్లపై మురుగునీరు పారకుండా వెంటనే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అనర్హులు రేషన్ కార్డు రద్దు చేసుకోవాలి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో మంగళవారం 15,16,17,18 డివిజన్లకు సంబంధించి ప్రజాపాలన కార్యక్రమాన్ని తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. దీనికి డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ హాజరై దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో ప్రభుత్వం అందచేయాలనుకుంటున్న తెల్లరేషన్ కార్డులు.. అవసరం లేనివారు వదులుకోవాలని కోరారు. ఆర్థికంగా బాగా ఉన్న వారు తెల్ల రేషన్‌కార్డును రద్దు చేసుకుంటే నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. పేదల గురించి ఆలోచించే నాయకులు, ధనవంతులు తెల్లరేషన్ కార్డును వదులుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ సుమన్‌రావు, కార్పొరేటర్లు ప్రభాకర్ రెడ్డి, మహేశ్వరిజైహింద్, డీఈఈ జ్యోతిరెడ్డి, బాలాపూర్ వాసులు పాల్గొన్నారు.

త్వరితగతిన బోరుపనులు పూర్తిచేయాలి



శ్మశానవాటికలో బోరు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీలోని శ్మశాన వాటికలో బోరు వేసే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, చాలా కాలం క్రితం జీహెచ్ఎంసీ నుంచి నిధులు మంజూరైనా సాంకేతిక కారణాల వల్ల పనులు ప్రారంభం కాలేదన్నారు. శ్మశానవాటికలో నీరు లేకపోవడంతో అంత్యక్రియల కోసం వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తాను అధికారుల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. స్పందించిన అధికారులు కాంట్రాక్టర్ వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారని ఆమె చెప్పారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ బోరు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జాప్యం చేస్తే సహించేది లేదన్నారు. ప్రజలందరూ అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. దయ్యాల వెంకటేశ్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రహరీలు నిర్మించరూ..

- మెజార్టీ పాఠశాలలకు రక్షణ కరువు
- రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

కడ్తాల్: కడ్తాల్ మండలంలోని మెజార్టీ ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో రక్షణ కరువైంది. దీంతో ఆయా పాఠశాలలు చీకటి పడితే తాగుబోతులకు అడ్డాగా, మూగజీవాలకు నిలయంగా మారాయి. దీనికి తోడు పాఠశాలల్లో నైట్‌వాచ్‌మెన్‌ల నియామకం కూడా చేపట్టకపోవడంతో రాత్రిపూట పాఠశాలల ఆవరణల్లో అసాంఘీక కార్యకలాపాలు సైతం చోటుచేసుకుంటున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అదునుగా కొందరు పాఠశాలల్లోని వస్తువులను ఎత్తుకెళ్తూ చోరీలకు పాల్పడుతున్నారు. రాత్రిపూట పాఠశాలల మైదానాల్లో మద్యం సేవించడంతో పాటు ఖాళీ సీసాలు, వ్యర్థాలను పాడేస్తున్నారు. దీంతో ఉదయం పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ఈ విషయాన్ని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారానికి నోచుకోవడంలేదు.

వస్తువులకు రక్షణ కరువు..

పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, డీఎన్‌టీ, ఆశ్రమ పాఠశాలలున్నాయి. వీటిలో కొన్నింటికి మాత్రమే ప్రహరీల నిర్మాణం చేపట్టారు. మిగతా పాఠశాలల్లో ప్రహరీలకు తోడు కనీసం అటెండర్లు కూడా లేరు. ప్రత్యేకించి 450కు పైగా విద్యార్థులు గల మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలకు ప్రహరీ లేకపోవడంతో పాఠశాలలోని వస్తువులకు రక్షణ కరువైంది. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన పాఠశాలలో కంప్యూటర్లు, ఇతర విలువైన సామగ్రి రాత్రివేళల్లో రక్షణ లేకుండా పోయింది. గతేడాది ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వపాఠశాలలకు ప్రహరీల నిర్మాణం చేపట్టడంతో పాటు నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

భట్టిని కలిసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంగళవారం ప్రజాభవన్‌లో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు.

డ్రైవర్ల సమ్మె.. పెట్రోల్ బంకుల్లో నో స్టాక్!

కేంద్ర ప్రభుత్వం కొత్త వాహనచట్టాన్ని అమల్లోకి తేవడాన్ని నిరసిస్తూ ట్రాన్స్‌పోర్టు లారీ డ్రైవర్లు మంగళవారం రెండు రోజుల ధర్నాకు పిలుపునిచ్చారు. సమ్మె కారణంగా మూడు రోజుల పాటు బంకులు సైతం మూసివేస్తున్నట్లు ఆయా సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో వాహనదారులు పెట్రోలు, డిజీల్ పోయించుకోవడానికి ఒక్కసారిగా బారులు తీరారు. దీంతో ఆయా బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి.

– సాక్షి నెట్‌వర్క్



మొయినాబాద్ పెట్రోల్ బంక్‌లో..



షాబాద్‌లో హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద బారులు తీరిన వాహనదారులు



చేవెళ్లలోని ఓ పెట్రోల్ బంకు వద్ద క్యూలైన్‌లో వాహనాలు



చేవెళ్ల: ఓ పెట్రోల్ బంకులో డిజీల్ అయిపోవడంతో నో స్టాక్ బోర్డు



కొత్తూరులో..